జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 11-1-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 216 పేజీలు: 4 వెల : రూ.7

# పేకాట శిబిరాలు.. కోడిపందాలు నిర్వహిస్తే.. కేసులు

*** ప్రశాంతంగా సంక్రాంతి నిర్వహించండి * లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం సేవలు వినియోగించుకోవాలి**
*** పాత నేరస్థులు, పేకాట శిబిరాలు నిర్వాహకులకు బైండోవర్ * ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి**



**శ్రీకాకుళం క్రైం, జనవరి 10 (వార్త):** సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని జిల్లా ప్రజలను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి కోరారు. పండుగ సందర్భంగా ఎవరైనా పేకాట, కోడి పందాలు, గుండు, డొక్కు ఆట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికే ఆయా ప్రాంతాల్లో నిఘా పెంచామన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పండుగ సందర్భంగా ఎవరైనా తన స్వగ్రామానికి ప్రయాణం వెళ్తే వారి విలువైన బంగారు ఆభరణాలు, వస్తువులు లాకర్లో గాని లేదా తమ వెంట తీసుకుని వెళ్లి భద్రపరుచుకోవాలన్నారు. లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం సేవలు వినియోగించుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినా, మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనాలు సీజ్‌తో పాటు పెద్ద ఎత్తున అపరాధ రుసుం విధిస్తామన్నారు. ఈవ్‌టీజింగ్, అల్లరి, తుంటరి చేష్టలకు పాల్పడితే కేసులు పెడతామన్నారు. రహదారి మార్గాలు, ముఖ్య కూడలిలో పోలీసు పెట్రోలింగ్, బీట్ సిబ్బందితో ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మద్యం రవాణా అరికట్టేందుకు ప్రధాన చెక్ పోస్టులు వద్ద విస్తృతంగా వాహన తనిఖీలు చేపడతామన్నారు. కోడి కత్తులు తయారీ, విక్రయాలు చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా పేకాట, కోడి పందాలు, గుండు, డొక్కు ఆట వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరిగితే జిల్లా ఎస్పీ 6309990800, స్పెషల్ బ్రాంచ్ సిఐ 6309990886, పోలీసు కంట్రోల్ రూమ్ డయల్ 100, పోలీసు వాట్సాప్ నెంబర్ 6309990933 సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

## దొంగలపై కేడీషీట్

దొంగతనాలకు పాల్పడుతున్న వారిపై కేడీషీట్ తెరుస్తామని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో దొంగతనాలు చేస్తున్న ఇద్దరు అంతర్ రాష్ట్ర చైన్‌స్నాచర్లను పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా బరంపురానికి చెందిన సుజిత్ కుమార్ పాడి, బాలకృష్ణ సాహులు కొత్తూరు, మందస, ఎచ్చెర్ల, కోటబొమ్మాళి పోలీసు స్టేషన్ల పరిధిలో దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వీరిద్దరూ గత ఏడాది డిసెంబరు 28న కొత్తూరు మండలం కాశీపు రం గ్రామంలో రోడ్డుపై నడిచి వెళ్తున్న ఓ మహిళ మెడలోని తులంన్నర బంగారు పుస్తల తాడును ఎదురుగా బైక్‌పై వచ్చిన తెంపేసుకుని పారిపోయారన్నారు. నవంబరు 8న మందస మండలం నర్సింగపురం గ్రామం వెళ్తున్న ఓ మహిళ మెడలో పావు తక్కువ మూడు తులాలు బంగారు పుస్తలతాడును, గత నెల 28న ఎచ్చెర్ల బైపాస్ సమీపంలో గొర్రెలు మేపుతున్న మహిళ మెడలోని రెండు తులాల పుస్తెల తాడును, కోటబొమ్మాళి మండలం నారాయణపురం సంతలో సామగ్రి కొనుక్కొని తిరిగి ఇంటికి వెళ్తున్న మహిళ మెడలో పుస్తల తాడును కూడా తెంపేసి పట్టుకుని పారిపోయారన్నారు. బరంపురం గొడవల్లో అరెస్ట్ అయిన సుజిత్‌కు జైలులో బాలకృష్ణ పరిచయం అయ్యాడని, జైలు నుంచి విడుదలైన తర్వాత వీరిద్దరు దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వీరిద్దరిపై ఇప్పటి వరకూ 32 కేసులు ఉన్నాయని తెలిపారు. ఈ నెల 9న మెట్టూరు జంక్షన్ వద్ద కొత్తురు పోలీసులు వాహన తనిఖీలు చేస్తుండగా అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా పై నేరాలకు పాల్పడినట్టు అంగీకరించారు. వీరి నుంచి ఏడున్నర తులాల బంగారు ఆభరణాలు రికవరీ చేశామన్నారు. ఈ కేసును ఏఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఛేదించిన కొత్తూరు సీఐ సీహెచ్ ప్రసాద్, ఎస్ఐ అమీర్ ఆలీ, కానిస్టేబుల్స్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.





## రథసప్తమి నాడు గట్టి బందోబస్తు

సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుక పురస్కరించుకొని ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని, సామాన్య భక్తులుకు దర్శనానికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసుకోవాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి సూచించారు. శుక్రవారం రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, ఆలయ అధికారులతో కలిసి అరసవెల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం నలువైపుల సందర్శించారు. వాహనాల పార్కింగ్, భక్తులు వెళ్లే దర్శనం మార్గాలు, బందోబస్తు, భద్రత, క్యూ లైన్లు మళ్లింపు, తీసుకోవలసిన చర్యలు, తదితర అంశాలపై పరిశీలించారు. ఆయన వెంట ఏఎస్పీ కేవీ రమణ, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, డీఎస్పీలు వివేకా ఆనంద్, ఈఓ వై.ఎల్.భద్రాది, సీఐలు ఇమ్మన్యూల్ రాజు, పైడిపు నాయుడు, ఈశ్వరరావు ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



కూటమి ప్రభుత్వంలో..
## తిరుమల అపవిత్రం

*** ప్రభుత్వ వైఫల్యంతోనే తొక్కిసలాట ఘటన**
*** ఆరుగురు మృతి బాధాకరం**
*** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు**

**మందస, జనవరి 10(వార్త):** ఎంతో పవిత్రత కలిగిన తిరుమల-తిరుపతి ప్రతిష్టతను కూటమి ప్రభుత్వం అపవిత్రం చేస్తోందని, కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. శుక్రవారం మందస పట్టణంలోని వాసుదేవపెరుమాళ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వైకుంఠ దర్శన టిక్కెట్లు జారీ సందర్భంగా తొక్కిసలాట వల్ల ఆరుగురు భక్తులు మృతి చెందడం, అనేకమంది గాయపడడం బాధాకరమన్నారు. ఈ దుర్ఘటన దిగ్భ్రాంతికరమన్నారు. ఈ సంఘటన కూటమి ప్రభుత్వం వైఫల్యమేనని ఆరోపించారు. బాధ్యులను విడిచిపెట్టి, సంబంధం లేనివారిపై చర్యలు తీసుకుని చేతులు దులిపేసుకున్నారన్నారు. హోంశాఖ, దేవదాయ శాఖ ఏం చేస్తుందని ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలతో చెలాగాట మాడుతున్నారన్నారు. సీజ్ ద షిప్ వ్యవహారం లాగే ఇది కూడా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చిన్నపాటి సంఘటన సైతం జరగలేదన్నారు. కార్యక్రమంలో మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, పార్టీ అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, గిన్ని తిరుపతిరెడ్డి, దల్లి జానకిరావురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అధికార పార్టీ నేతలే.. ఇసుకాసురులు!

*** వంశధార నది మధ్యలో రహదారి నిర్మాణం * నిబంధనలకు విరుద్ధంగా జేసీబీలతో తవ్వకాలు**
*** చోద్యం చూస్తున్న మైన్స్, రెవెన్యూ అధికారులు * ఇసుక మాఫియాను అడ్డుకున్న టీడీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ**



**కొత్తూరు, జనవరి 10 (వార్త):** ఇసుక అక్రమంగా తరలింపును అడ్డుకోవాల్సిన అధికార పార్టీ నేతలే.. స్వయంగా ఇసుకాసురులు అవతారం ఎత్తారు. కొత్తూరు మండలంలోని ఆకులతంపర సమీపంలో వంశధార నదికి అడ్డంగా రోడ్డు వేసి మరీ ఇసుకను నిబంధనలకు విరుద్ధంగా జేసీబీలతో తవ్వి తరలించుకుపోతున్నారు. అధికార పార్టీ నేతలే ఇలా చేస్తుండడంతో రెవెన్యూ, మైన్స్, పోలీసు అధికారులు మౌనం వహిస్తున్నారు. రాత్రనకా పగలనకా ఇసుకను తోడేస్తున్నారు. వంతెనకు సమీపంలోనే తవ్వకాలు జోరుగా సాగుతుండడంతో ప్రమాదం పొంచివుంది. గతంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఈ ఇసుక తరలింపును అడ్డుకున్నారు. జేసీబీతో పాటు లారీలను సంబంధత అధికారులకు అప్పగించారు. అయినప్పటికీ మళ్లీ ఇదే తంతు సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే, టీడీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ స్వయంగా వెళ్లి ఆకులతంపర వద్దకు శుక్రవారం వెళ్లి ఇసుక తవ్వకాలను, తరలింపును అడ్డుకున్నారు. సంబంధిత శాఖాధికారులకు సమాచారం అందించారు. అక్రమంగా, నిబంధనలకు వ్యతిరేకంగా ఇసుకను తవ్వేస్తుంటే ఏం చేశారని ఆయన నిలదీశారు.





జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మందస ఎస్ఐగా కృష్ణప్రసాద్ బాధ్యతల స్వీకరణ

**మందస, జనవరి 10(వార్త):** మందస ఎస్ఐగా కె.కృష్ణప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం క్రైం పోలీసు స్టేషన్ నుంచి బదిలీపై ఆయన మందసకు వచ్చారు. గతంలో పనిచేసిన ఎస్ఐ ఎస్.కె.ఖాదర్ బాషా సస్పెండ్ కావడంతో సుమారు రెండు నెలలుగా ఈ స్థానం ఖాళీగా ఉంది. ఎట్టకేలకు రెగ్యులర్ ఎస్ఐగా కృష్ణప్రసాద్‌ను ఉన్నతాధికారులు నియమించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ శాంతి, భద్రతలకు ప్రజల సహకరించాలని కోరారు. నేరరహిత మందసగా తీర్చి దిద్దుతామన్నారు. పోలీసు స్టేషన్ సిబ్బంది ఆయన స్వాగతం పలికి, అభినందించారు.



# ఉల్లాస్ శిక్షణ విజయవంతం

**-జడ్పీ సీఈవో శ్రీధర్ రాజా**

**శ్రీకాకుళం, జనవరి 10(వార్త):** మహిళల అక్షరాస్యతను పెంచేందుకు కేంద్రప్రభుత్వం రూపొందించిన ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని జిల్లా పరిషత్ సీఈవో శ్రీధర్ రాజా పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి ఉల్లాస్ రెండవ విడత శిక్షణా కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం మీటింగ్ హాల్ లో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వయోజన విద్యపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన




2వ విడత జిల్లా స్థాయి ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో అన్ని మండల పరిషత్తు అభివృద్ధి అధికారులు, ఏపీఎమ్ లు పాల్గొన్నారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని గ్రామ స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలని వయోజన విద్య ఉప సంచాలకులు ముద్దాడ వెంకట రమణ అన్నారు. స్వయం సహాయక సంఘాల గ్రూపులలోని మహిళా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తయారు చేయడంలో వాలంటీర్ టీచర్ల పాత్ర ఎంతో కీలకమని, వారికి అవసరమైన పాఠ్యపుస్తకాలు జిల్లాకు అందాయని తెలిపారు. అంతేకాకుండా, ఆయా టీచర్లకు ప్రోత్సాహకంగా ప్రతి ఒక్కరికి రూ.400లు మంజూరు చేయడం జరిగిందని, డిజిటల్ అక్షరాస్యత కోసం టిసిఎస్ ద్వారా ప్రతి వారం ఆన్‌లైన్ పాఠాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి తిరుమల చైతన్య, మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శాంతిశ్రీ, టిసిఎస్ ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి విశ్వనాథ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# శరత్‌బాబు ఆదర్శనీయుడు



**-కొనియాడిన వక్తలు**

**మందస, జనవరి 10(వార్త):** ప్రభుత్వ ఉద్యోగిగా బాధ్యతలు నెరవేర్చుతునే సమాజానికి ఉపయోగపడే పనులు చేయడం ఎంతో గొప్ప విషయం.. పదిమందికి ఆదర్శంగా పని చేయాలంటే అంకితభావం కలిగి ఉండాలి. సరిగా అదే క్వాలిటీస్ చింతాడ శరత్ బాబులో ఉన్నాయి. అధ్యాపకునిగా, ప్రిన్సిపల్గా, జాతీయ సేవాపథకం జిల్లా సమన్వయకర్తగా ఎన్నో మంచి పనులు చేశారు. సమాజానికి మంచి సందేశాలు ఇస్తున్నారు. ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. మందస ప్రభుత్వజూనియర్ కళాశాలలో చింతాడ శరత్బాబు అధ్యాపకునిగా పని చేస్తున్నారు. ఇన్చార్జి ప్రిన్సిపల్ కూడా బాధ్యతలను సమర్థవంతంగా నెరవేర్చారు. విద్యార్థుల్లోని ప్రతిభను వెలుగులోకి తీసుకురావడానికి ఎన్నో విధాలుగా కృషి చేస్తున్నారు. తాను విద్యనేర్పుతున్న విద్యాలయంలో విద్యార్థుల్లో పోటీతత్వం నింపడానికి శతవిధాలా కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా ప్రతీ ఏటా శరత్ బాబు అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానిస్తున్నారు. వారి తల్లిదండ్రులను కూడా సముచితరీతిలో సత్కరిస్తున్నారు. మందస ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అత్యధిక మార్కులు పొందిన బైపీసీ విద్యార్థిని బొర్ష కుమారిరోణా ప్రిన్సిపల్ బి.తేజశ్వరావు అధ్యక్షతన కళాశాల ఏజీఎంవో, జంతు శాస్త్ర అధ్యాపకుడు చింతాడ శరత్ బాబు కార్యక్రమాన్నిముందుకు నడిపించారు. ఇదే కార్యక్రమం గత 13 సంవత్సరములుగా చింతాడ శరత్ బాబు వివిధ కళాశాలలో పనిచేస్తూ ఆ ఏడాది బైపీసీ విభాగంలో అత్యధిక మార్కులు పొందిన విద్యార్థులకు రూ. 5000 నగదు ప్రోత్సాహకంతో పాటు వారి తల్లిదండ్రులకు సన్మానం చేస్తూ వచ్చారు. ఈ ఏడాది కూడా బైపీసీ విభాగంలో బొర్ష కుమారిరోణాకి రూ.5000లు పారితోషకమును అందించి ఆమె తల్లికి కూడా సన్మానం చేశారు. శరత్ బాబు మాట్లాడుతూ ఈ విధంగా విద్యార్థులను ప్రోత్సహించితే, తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకుంటారన్నారు. వక్తలుగా గురుగుబెల్లి రమణమూర్తి వ్యవహరించగా, కార్యక్రమంలో పలాస ప్రభుత్వ జూనియర్ కళాశాల బాడ వెంకటమోహన్, టి.వాసుదేవ్, అధ్యాపకులు బబ్లసాహు, దుర్యోధన ఎన్ఎస్ఎస్ పీఓలు గురుగుపల్లి రమణమూర్తి, బొడ్డు ప్రవీణ్ కుమార్, నాగభూషణ్, పి.గోవిందరాజులు, శాంతకుమారి రవికుమార్, జానకిరామ్, సాప నరేష్, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



# కోమాలో ఉన్న విద్యార్థినికి ఆర్థిక సాయం

**- చిన్నతనంలో పెద్దకష్టం రావటం బాధాకరం**

**- సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి**

**శ్రీకాకుళం, జనవరి 10(వార్త):** శ్రీకాకుళం లోని గుజరాతిపేటకి చెందిన ఎం.అనూష నూజివీడు ఐఐఐటి కళాశాలలో ఈఈఈ మొదటి సంవత్సరం చదువుతోంది. విధివశాత్తూ బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ప్రస్తుతం విజయవాడ మణిపాల్ వైద్యశాలలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. వీళ్లది నిరుపేద కుటుంబం కావడంతో కొన్ని విద్యాసంస్థలు, విద్యార్థులు కొంతమేరకు ఆర్థిక సహాయం చేశారు. పూర్తిగా కోలుకోవటానికి ఇంకొంత సమయం పడుతుందని, వైద్యానికి ఎక్కువ మొత్తంలో ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపగా, వైద్యానికి ఇంకా ఆర్థిక సాయం అవసరమని తెలియడంతో, సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితి చేస్తున్న సేవలు తెలుసుకుని, కుటుంబ సభ్యులు సిక్కోలు స్వచ్ఛంద సేవా సమితిని సంప్రదించడం జరిగిందని సభ్యులు తెలిపారు. స్పందించిన సంస్థ సభ్యులు దాతలు, మిత్రుల సహకారంతో రూ. 11 వేల రూపాయలను ఈ రోజు కుటుంబ సబ్యులకు అందనేసి చిన్నతనంలో పెద్దకష్టం రావటం బాధాకరమని, మా వంతు బాధ్యతగా చిరుసాయాన్ని అందించామని, అమ్మాయి వైద్య



ఖర్చులకు సహాయ, సహకారాలు అందించవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో కుంచాల సింహాచలం, జరుగుల్ల రామారావు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# చారిత్రకం.. స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం

**-గాంధీ మందిరాన్ని సందర్శించిన**

**వాకర్స్ ఇంటర్నేషనల్ బృందం**

**శ్రీకాకుళం, జనవరి 10(వార్త):** భారత స్వాతంత్ర్య స్ఫూర్తిని.. త్యాగధనులు కీర్తిని ఒకేచోట నెలకొల్పిన చారిత్ర ప్రదేశం గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధుల స్మృతివనమని వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి కొనియాడారు. దేశంలో తొలిసారిగా తాను ఇంతటి గొప్ప ప్రదేశాన్ని సందర్శించానని అన్నారు. జిల్లా పర్యటనకు విచ్చేసిన వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ ఎం.ప్రభావతి, వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్ తో పాటు బృంద సభ్యులతో కలిసి గాంధీ మందిరాన్ని శుక్రవారం సందర్శించారు. స్మృతివనంలో నెలకొని ఉన్న మహనీయుల ప్రతిరూపాలను చూసి పులకించిపోయారు. దేశం కోసం సర్వస్వాన్ని త్యాగం చేసిన త్యాగమూర్తులతో పాటు సమాజాన్ని ప్రభావితం చేసిన సంఘ సంస్కర్తలు ఒకేచోట కొలువుదీరి



ఉండడంతో పాటు మువ్వెన్నల పతాకం 105 అడుగుల ఎత్తులో ప్రతిష్ఠించడం ఎంతో స్ఫూర్తిని నింపుతోందన్నారు. భావితరాలతో పాటు ప్రతిఒక్కరు త్యాగమూర్తుల స్ఫూర్తిని అందిపుచ్చుకొని దేశం కోసం, ధర్మం కోసం సమిష్టిగా పనిచేయాలని ప్రభావతి అన్నారు.

కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ ఏరియా ఉపాధ్యక్షుడు డాక్టర్ నాగేంద్రరావు, కార్యదర్శి జి.సూర్యనారాయణ, ట్రెజరర్ సురేష్ బాబు, పూర్వ గవర్నర్లు గేదెల ఇందిరాప్రసాద్, పి.జి.గుప్తా, క్యాబినెట్ సెక్రటరీ ఎస్.సంజీవరావు, జర్నలిస్టు సంఘ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, వాకర్స్ ప్రతినిధులు గేదెల లక్ష్మి, బి.వి.రవిశంకర్, తమ్మినేని ఉషారాణి, పాండ్రంకి మురళీకృష్ణ పాల్గొన్నారు.



## నేటి నుంచి రాష్ట్ర టెన్నికాయిట్ పోటీలు

**పలాస, జనవరి 10 (వార్త):** పలాస క్రీడా మైదానంలో ఈనెల 11, 12 తేదీల్లో రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు, నిర్వహిస్తున్నట్లు టెన్నికాయిట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు, రాష్ట్ర పోటీల ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.తవిటయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం ఏర్పాట్లు పూర్తయ్యాయని, ఇందులో క్రీడాకారుల నైపుణ్యాన్ని అనుసరించి వారిని జాతీయ పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

## శ్రీహరిపురంలో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్



**వంగర, జనవరి 10(వార్త):** సంక్రాంతి సందర్భంగా వంగర మండలంలోని శ్రీహరిపురం పంచాయతీలో శుక్రవారం " స్పెషల్ శానిటేషన్ డ్రైవ్" సర్పంచ్ ప్రతినిధి ఉత్తరావల్లి రామకృష్ణ, పంచాయతీ సెక్రెటరీ లెంక ప్రదీప్ నిర్వహించారు. గ్రామంలోని అన్ని వీధుల్లోని కాలువల్లో ఉన్న పూడికలను, పేరుకు పోయిన చెత్తను తొలగించారు. రోడ్ల పక్కనున్న చెత్తను తీసి శుభ్రం చేశారు. సూక్ష్మక్రిములను నివారించడానికి ప్రతి వీధిలోనూ బ్లీచింగ్ చల్లారు. పరిశుభ్రమైన మంచినీరు ప్రజలకు అందించడానికి మంచినీటి బావుల్లో బ్లీచింగ్ కలిపారు. బావులు, బోరింగ్ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ చల్లారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## స్వర్ణభారతిలో సంక్రాంతి సంబరాలు



**ఇచ్ఛాపురం, జనవరి 10(వార్త):** ఇచ్ఛాపురం స్వర్ణభారతి జూనియర్ కళాశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హరిదాసు వేషధారణతో భోగి మంటలు వేసి, విద్యార్థిని, విద్యార్థులు సంప్రదాయమైన దుస్తులు ధరించి, మన భారత దేశ సంస్కృతి అద్దం పట్టే విధంగా తయారై, సాంస్కృతిక నృత్యాలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ చాట్ల తులసీదాస్ రెడ్డి మాట్లాడుతూ మనం ఎంత ఉన్నత స్థాయికి ఎదిగిన భారతీయ సాంప్రదాయాలను మరచి పోకూడదని, వాటిని ఎల్లప్పుడూ కాపాడుకునే విధంగా మేలగాలని, భోగి, సంక్రాంతి, కనుమ పండగ యొక్క విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. ప్రపంచానికి అన్నం పెట్టే రైతును విస్మరించకూడదని, ఈ పండుగ జరుపుకోవడానికి ప్రధాన కారణం రైతు అని తెలియజేశారు. సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ చాట్ల రాము , ప్రిన్సిపల్స్ జల్లు జయప్రకాష్, సందీప్ మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



## బాల సంజీవిని కిట్ల పంపిణీ

**శ్రీకాకుళం, జనవరి 10(వార్త):** ఈదుపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు వద్ద గర్భిణులకు బాలింతలకు బాల సంజీవని కిట్లను గ్రామ సర్పంచ్ నర్తు వరప్రసాద్ రావు, జెడ్ పి టి సి సభ్యురాలు ఉప్పాడ నారాయనమ్మ, వైస్ ఎం పి పి దువ్వు వివేకానందరెడ్డి ,మాజీ ఎం పి టి సి దుక్క నీలాద్రి రెడ్డి, మురపాల చంద్రయ్య, అంగన్వాడీ కార్యకర్తలు ఆశి జ్యోతి, దువ్వు విమల, తెలుకల లత, ఉదయపురం పార్వతి తదితరుల చేతులమీదుగా అందజేశారు.





## వైభవంగా ఆదిత్యుని కళ్యాణం

**శ్రీకాకుళం, జనవరి 10(వార్త):** ప్రత్యక్ష దైవం, ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి వారికి వైభవంగా కళ్యాణం నిర్వహించారు. ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని స్వామి వారికి కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీ ఇప్పిలి శంకర శర్మ తెలిపారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కళ్యాణం వైభవంగా జరిగిందని ఆలయ ఈవో యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.

## పీఆర్ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ




**వంగర, జనవరి 10(వార్త):** ఏపీ పంచాయతీ రాజ్ మినిస్ట్రియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా 2025 నూతన సంవత్సర క్యాలెండర్ ను వంగర ఎంపీపీ ఉత్తరవెల్లి సురేష్ ముఖర్జీ ఎంపీడీవో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆవిష్కరణ కార్యక్రమంలో డి ఎల్ డి ఓ. హేమ్ సుందర్. ఎంపీడీవో ఎల్ త్రినాథ్. ఏపీ పంచాయతీ రాజ్ మినిస్ట్రియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ శ్రీకాకుళం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ కిషోర్ కుమార్. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## తిరుమల ఘటనకు సర్కార్‌దే బాధ్యత



**మందస, జనవరి 10(వార్త):** తిరుమల పుణ్య క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించు కొని దర్శన టికెట్లు జారీ సందర్భంగా తొక్కిసలాటతో భక్తులు మృతిచెందడం, అనేకమంది గాయపడడం చాలా బాధాకరమని వైఎస్ ఆర్సిపి యువజన నేత బత్తిన లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో ఈ దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇది ముమ్మాటికి కూటమి సర్కార్ వైఫల్యమైనని, ఈ ఘటనకు సర్కార్ బాధ్యత వహించాలన్నారు. హెూం శాఖ, దేవాదాయ శాఖ ఏం చేస్తుందని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో చిన్నపాటి సంఘటన సైతం జరగలేదని ఆయన గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమల తిరుపతి దేవస్థానంలో రాజకీయ జోక్యం బాగా పెరిగిపోయిందని, ఆధ్యాత్మికత భావంతో ఉన్న భక్తులకు తగిన గౌరవం దక్కడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తిరుమల పవిత్రత గురించి మాట్లాడే కూటమి సర్కార్లోని పెద్దలు వైకుంఠ ద్వార దర్శనం విషయంలో జరిగిన దుర్ఘటనకు సమాధానం చెప్పాలని బత్తిన లక్ష్మణ్ డిమాండ్ చేశారు. తొక్కిసలాటలో మృతి చెందిన ఆరుగురి కుటుంబాలకు పరిహారం ఒక్కొక్కరికి కోటి రూపాయలు చొప్పున ఆరు కోట్లు ఇవ్వాలని ఆయన కోరారు. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడానికి దేశం నలు మూలల నుంచి వస్తున్న భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో టీటీడీ విఫలమైంద న్నారు. తిరుపతి చరిత్రలో ఈ సంఘటన మాయని మచ్చగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ప్రముఖ ఆధ్యాత్మిక దామం తిరుపతి తిరు మల పవిత్రతను పరిరక్షించడమే కాక.. భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆయన కోరారు.

## తలగాంలో ముమ్మరంగా పనులు

**వంగర, జనవరి 10(వార్త):** వంగర మండలంలోని తలగాం గ్రామ పంచా యతీలో ఎస్సీ కాలనీలో కాలువలు, సి సి రోడ్లు పనులను శుక్రవారం మాజీ ఎంపీపీ పైల వెంకటరమణ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం నిర్విరామంగాజరుగుతుందన్నారు. ఎమ్మెల్యే కొండ్రు మురళీమోహన్ నియోజక వర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. తలగాం ఎస్సీ కాలనీలో 145 మీటర్లలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో తలగాం పంచాయతీ మాజీ సర్పంచ్ పైల శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ శంకర్, ఎస్సీ కాలనీ యువత చంటి, మురళి తదితరులు ఉన్నారు.



# హెల్మెట్‌తో సురక్షిత భవిష్యత్

**-జిల్లా ప్రధాన న్యాయమూర్తి**

**జునైద్ అహ్మద్ మౌలానా**



**శ్రీకాకుళం, జనవరి 10(వార్త):** ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేసే ప్రతి ఒక్కరూ వయస్సుతో పనిలేకుండా విధిగా హెల్మెట్ వాడాలని తద్వారా ప్రమాద రహిత జిల్లాగా మారడానికి అవకాశం ఉంటుందని శ్రీకాకుళం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శుక్రవారం సాయంత్రం జిల్లా న్యాయస్థానం ఆవరణలో జిల్లా న్యాయమూర్తుల సమక్షంలో అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పైడి భీమవరం వారి సౌజన్యంతో కోర్టులో పలువురు ఉద్యోగులకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాదులు ప్రతిక్షణం ఆరోగ్యం పట్ల, వ్యక్తిగత సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, కక్షిదారులతో స్నేహ సంబంధాలతో మెలగాలని ఆకాంక్షించారు. న్యాయవాదులు, జ్యూడిషల్ సిబ్బంది సంరక్షణ కొరకు ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రముఖ కంపెనీ అపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, పైడి భీమవరం వారి ఆర్థిక సౌజన్యంతో హెల్మెట్లను ఉచితంగా సరఫరా చేపట్టడం ఎంతో అభినందనీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయమూర్తులు పి.భాస్కరరావు, సిహెచ్ వివేకానంద్, శ్రీనివాస్, ఎస్ఎం ఫణికుమార్, కే కిషోర్, ఆర్.సన్యాసినాయుడు, జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయ సేవా సాధికారత సంస్థ సభ్యులు గేదెల ఇందిరా ప్రసాద్, కొమరాపు ఆఫీస్ నాయుడు, ఆపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ప్రతినిధులు కే.నిత్యానంద రెడ్డి, శరత్ చంద్రారెడ్డి, కే మదన్ కుమార్, కే కమలాకర్ రెడ్డి, వైయస్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన వాడల్లో ఆడపిల్ల సొసైటీ సేవలు




**కొత్తూరు, జనవరి 10(వార్త):** ఇప్పగూడ , రేగుల గూడ గిరిజన ప్రాంతాలలో శ్రీకాకుళం జిల్లా ఆడపిల్ల సేవా సొసైటీ ఫౌండర్,పొందూరు సచివాలయం 1 మహిళా పోలీస్ లావణ్య తన బృందం తో పర్యటించారు.

ఈ సందర్భంగా గిరిజన వాసులతో ఆమె మమేకం అయ్యారు. ఎన్నో కిలోమీటర్లు నడిచి గిరిజన ప్రాంతానికి చేరుకుని ఆదివాసీయుల జీవన విధానాలను, వారి ఆర్థిక పరిస్థితులను,ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ ఇలీషా జెంట్ చేతుల మీదుగా రాము ,హేమ దంపతుల సహకారంతో పాటు తమ ఫౌండేషన్ తరుపున ఆదివాసీయులకు బట్టలు , పుస్తకాలు , పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్య పై , జీవన విధానాలను మెరుగు పరిచే అంశాలపై అవగాహన కల్పించారు. నేటి సమాజంలో ఆడపిల్లకు విద్య అనేది అత్యంత అవసరమని ,విద్య అనేది ఆడపిల్లకు ఒక రక్షణ కవచం వంటిదని లావణ్య సూచించారు. ప్రతీ ఒక్క ఆడపిల్ల చదువుకు దూరం కాకూడదని సూచించారు. గిరిజనులు పండించే అటవీ ఉత్పత్తులకు దళారుల బెడద వెంటాడుతుండటం తో సరైన గిట్టుబాటు ధర లేక ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. నేటి వరకు సరైన సహదారి సౌకర్యం లేకపోవడం తో గిరిజన గ్రామాల అభివృద్ధి ఆమడ దూరంలో ఉందన్నారు.

అక్షరాస్యతకు దూరంగా అనారోగ్య సమస్యలు వచ్చినపుడు సరైన వైద్య సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆదివాసీ ప్రాంతంలో నివసించే ప్రజలకు వైద్య , విద్య పరంగా ఏ అవసరాలు ఉన్న తమ ఫౌండేషన్ కు తెలియజేస్తే తమ సంస్థ తరఫున తప్పకుండా సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు.

# ప్రపంచ శాంతికి ఏసు బోధనలు మార్గదర్శకం



**వంగర, జనవరి 10(వార్త):** ఏసుక్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి మార్గ నిర్దేశనాలని జాతీయ సువార్తికులు మజ్జి.కృపారావు అన్నారు. శుక్రవారం విజయనగరం జిల్లా వంగర మండలంలో గల తన స్వగ్రామమైన శ్రీహరిపురం గ్రామంలో ఏర్పాటు చేసిన సువార్త కూడిక సభ కు ముఖ్య అతిథిగా హాజరై అయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కృపారావు మాట్లాడుతూ, యేసు క్రీస్తు 2000 సంవత్సరాల క్రితం మానవాళి కి శాంతిని అందించడానికి పుట్టడం జరిగింది అందుకనే క్రీస్తు శకం, క్రీస్తుపూర్వం అనీ చరిత్ర చెపుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు ఇతరులు పట్ల శాంతి, దయ, ప్రేమ కలిగి ఉండాలని ఉద్బోధించారు. ఇరుగు పొరుగు వారి పట్ల కృప చూపాలని,కష్టాల్లో ఉన్నవారికి ఆదుకోవాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరం గా ఉంటూ మంచి మార్గాల్లో పయనించాలని సూచించారు. ప్రపంచంలో యేసు క్రీస్తు మార్గం మతం కాదని మంచి మార్గమని, యేసు క్రీస్తు శక పురుషుడు అన్నారు. ప్రతివారు యేసును అనుసరించి సమాజానికి సేవ చేయాలని మజ్జి కృపారావు పిలుపి నిచ్చారు. ఈ కార్యక్రమంలో సభ నిర్వాహకులు మజ్జి తవిటయ్య, పాస్టర్లు అప్పారావు, శ్రీను, రమణ, మజ్జి. భారతి, ఎం.రవి, మజ్జి విజయ్ రాజు, విశ్వాసులు అధికి సంఖ్య లో పాల్గొన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## రేపు జాతీయ యువజనోత్సవం

శ్రీకాకుళం, జనవరి10: నెహ్రూ యువ కేంద్రం, సెట్‌శ్రీ, స్వామి వివేకానంద సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి పురస్కరించు కొని ఈ నెల 12న ఉదయం 9గంటలకు శ్రీకాకుళం పట్టణంలో జాతీయ యువ జనోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ కె.వెంకట ఉజ్వల్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని సూర్య మహల్ జంక్షన్ వద్ద ఉన్న వివేకానందుని విగ్రహం వద్ద ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహననాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జిల్లా కలెక్టరు స్వప్నిల్ దినకర్ పుండ్కర్, స్థానిక శాసనసభ్యులు గొండు శంకరరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని వివేకానందునికి పూల మాలలతో ఘన నివాళులర్పించి తమ సందేశాలు తెలుపుతూ ప్రపంగించనున్నారన్నారు. యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు, యువతీ, యువకులు, ప్రజలు తదిత రులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి



**ఇచ్చాపురం, జనవరి 10(వార్త):** బొడ్డఖాలి గ్రామంలో కొలువైనటువంటి కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం లో వైకుంఠ ఏకాదశి పూజలు వైభవంగా జరిగాయి.ప్రాతకాలంలో ఆలయ ప్రధాన అర్చకలు చే 5 గంటలకు సుప్రభాత సేవ మొదలుకొని నిత్య అర్చన అలంకార అనంతరం ఆరు గంటలకు ఉత్తర ద్వార దర్శనం కి అనుమతించారు. స్వామి అనుగ్రహంతో అధిక సంఖ్యలో భక్తులు ఉత్తర ద్వార గుండా ప్రవేశించి స్వామి దర్శించుకుని స్వామి అమ్మవార్ల దివ్య అనుగ్రహం పొందారు. అలాగే శనివారం ఉదయం గోధారంగనాథ స్వామి కళ్యాణ మహోత్సవం , సాయంకాలం 6 గంటలకు కోలాటం తో గోధారంగనాథ స్వామి వార్ల తిరువీధి కార్యక్రమం నిర్వహిస్తారు. గిలాయి వీధి వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయంలో కూడా ఉత్తర ద్వార దర్శనాలు కల్పించారు.



**శ్రీకాకుళం, జనవరి 10(వార్త):** అరసవిల్లి దరి లో గల శ్రీ రమ్మీ తిరుమల ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తుల కోసం ఉత్తర ద్వార దర్శనానికి ప్రధాన అర్చకులు ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అభ్యర్ధిగా భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకున్నారు ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈరోజు 31 డివిజన్ టిడిపి ఇన్చార్జ్ విభూది సూరిబాబు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సూరిబాబుకి ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం అమ్మవారి చిత్రపటాన్ని సూరిబాబుకి అర్చకులు అందజేశారు.

### వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న సిరిపురం..

**ఎల్ఎన్ పేట, జనవరి 10(వార్త):** వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పాతపట్నంలోని శ్రీ వెంకటేశ్వరస్వామిని బీజేపి సీనియర్ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన భక్తులనుద్దేశించి ప్రసంగించారు. ముక్కోటి దేవతలతో కలసి శ్రీ మహావిష్ణువు దర్శనమిచ్చే పర్వదినం రోజున ఆ భగవంతుడి కరుణాకటాక్షాలు ప్రజలు, అందరిపైనా ఉండాలని దేవదేవుణ్ని ప్రార్ధించారు. ఈ కార్యక్రమంలో సరాలి గ్రామ సర్పంచ్ పడాల షణ్ముఖరావు, బిజేపి నాయకులు, కార్యకర్తలు, భక్తులు తధితరులు పాల్గొన్నారు.



# 'రెవెన్యూ' అర్జీలు సత్వరం పరిష్కరించాలి







**శ్రీకాకుళం, జనవరి 10(వార్త):** : రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. "అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.శుక్రవారం టెక్కలి ఆర్.డి.ఓ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలిసి పలాస, టెక్కలి రెవిన్యూ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, సంబంధిత అధికారులు సిబ్బంది సమన్వయంతో పని చేసి, రైతుల సమస్యలను తొందరగా పరిష్కరించాలి. బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర రావు, టెక్కలి, పలాస రెవెన్యూ అధికారులు కృష్ణమూర్తి, వెంకటేష్, కె.ఆర్.సి. డిప్యూటీ కలెక్టర్లు బి.పద్మావతి, లావణ్య, ఆయా మండలాల ఉప తహసిల్దార్లు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, సర్వేయర్లులు, వి ఆర్ ఓ లు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## క్రీడల్లో యువత రాణించాలి



**మెళియాపుట్టి, జనవరి 10 (వార్త):** యువత తలచుకుంటే దేనినైనా సాధించగలరని, యువత క్రీడల్లో సైతం మరింతగా రాణించాలని మెళియాపుట్టి సబ్ ఇన్స్పెక్టర్ పి.రమేష్‌బాబు అన్నారు. సంక్రాంతి సందర్భంగా గొప్పిలి గ్రామంలో ప్రీమియర్ లీగ్ క్రికెట్‌తో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఎస్సై రమేష్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. అనంతరం పలువురు యువకులకు క్రికెట్ బ్యాట్లు, కిట్లు అందించారు. గ్రామపెద్దలు పల్లి యోగి, ఉపసర్పంచ్ భువన పాత్రో, కార్యదర్శి సుదర్శన్ రావు, సచివాలయ సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక ప్రమాదాలపై మాక్ డ్రిల్



**ఎచ్చెర్ల జనవరి 10(వార్త):** ఎచ్చెర్ల మండలం పొన్నాడ గ్రామము నందు గల దీపక్ మైనింగ్ సొల్యుషన్స్ లిమి టెడ్ యూనిట్ నందు అత్యవసర ప్రమాద మాక్ డ్రిల్ కార్యక్రమమును డిప్యుటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ పరిశ్రమలు శాఖ, జిల్లా అగ్నిమాపక అధికారి, ఎన్ డి ఆర్ ఎఫ్ సంయు క్తముగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భముగా పరిశ్రమలో పని చేయు కార్మికులకు, కాంట్రాక్ట్ ఉద్యోగు లకు ప్రమాదములపై అవగాహన, భద్రతా పరికరములను ఉపయో గించుట, ప్రమాదకర పరిస్థితుల యందు పాటించవలసిన పద్ధతుల పై అవగాహన కల్పించారు. పరిశ్రమలో గల ఇవాపరేటర్ కండెన్సర్ యొక్క లెవెల్ గేజు ఐసొలేషన్ వాల్వ్ యొక్క గ్లాండ్ ద్వారా అమ్మోనియా ద్రావకము లీకు సంభవించినప్పుడు, కలిగే అత్యవసర పరిస్థితిని ఎదుర్కొనే విధానాలపై మాకు డ్రిల్ ద్వారా చూపించి అవగా హన కల్పించారు. దీపక్ మైనింగ్ సొల్యూషన్స్ యూనిట్ హెడ్ మనోజ్ అడ్డాల ఈ డ్రిల్‌ను పర్యవేక్షించారు.





# ఘనంగా సుడా చైర్మన్ జన్మదిన వేడుకలు



**ఎల్ఎన్‌పేట/ హిరమండలం, జనవరి 10(వార్త):** పాతపట్నం, పాలకొండ నియోజకవర్గాలలో సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకులు శ్రీకాకుళంలో లయన్స్ బ్లడ్ బ్యాంకులో పలువురు రక్తదానం చేశారు. మెళియాపుట్టి మండలంలో జనసైనికులు శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కేక్‌లను కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు.కార్యక్రమంలో పలువురు జనసైనికులు, అభిమానులు పాల్గొన్నారు.

**మెళియాపుట్టిలో..**





శ్రీకాకుళం జిల్లా సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మెళియాపుట్టిలో జనసేన పార్టీ నాయకులు దుక్క బాలరాజు ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శివాలయంలో ప్రత్యేక పూజలు చేయించి, అనంతరం కేక్ కటింగ్ చేశారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల, అభిమానుల, యువకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల జనసేన పార్టీ నాయకులు చింతల ప్రశాంత్, పిట్ట హరికృష్ణ, బూరగాన సత్యనారాయణ, అడివయ్య, సత్యనారాయణ రతో, నారాయణరావు, విజయ్‌కుమార్, చంద్రశేఖర్,నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546